విపణిలోకి స్కోడా కైలాక్ ఎస్‌యూవీ

ప్రారంభ ధర రూ.7.89 లక్షలు

న్యూఢిల్లీ, జనవరి 27: ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా స్కోడా..కైలాక్ మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని మరింత తీవ్రతరం చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ కారు ప్రారంభ ధర రూ.7.89 లక్షలుగా నిర్ణయించింది. 1.0 టీఎస్ఐ ఇంజిన్‌తో తయారైన ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 19.68 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. క్లాసిక్, సిగ్నిచర్, సిగ్నిచర్+, ప్రిస్టేజ్ వంటి నాలుగు రకాల్లో లభించనున్న ఈ కారుకు 5 స్టార్ రేటింగ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 25 బలమైన భద్రత ఫీచర్లు ఉన్నాయని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్రా జనేబా తెలిపారు. కేవలం 10.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 188 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ కారుపై మూడేండ్లు లేదా లక్ష కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయాన్ని కల్పిస్తున్నది.

కెనరా బ్యాంక్ లాభం 4,104 కోట్లు

కే సత్యనారాయణ రాజు
కెనరా బ్యాంక్
ఎండీ, సీఈవో

న్యూఢిల్లీ, జనవరి 27: ప్రభుత్వరంగ ఆర్థిక సేవల సంస్థ కెనరా బ్యాంక్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,104 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని గడించింది. ఆదాయం పుంజుకోవడం, నిరర్థక ఆస్తులు తగ్గిపోవడంతో అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.3,656 కోట్ల లాభంతో పోలిస్తే 12.25 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించింది. బ్యాంక్ ఆదాయం కూడా రూ.32,334 కోట్ల నుంచి రూ.36,114 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.39 శాతం నుంచి 3.34 శాతానికి దిగొచ్చాయని, అలాగే నికర నిరర్థక ఆస్తుల విలువ కూడా 0.99 శాతం నుంచి 0.89 శాతానికి తగ్గినట్టు బ్యాంక్ ఎండీ, సీఈవో కే సత్యనారాయణ రాజు తెలిపారు.

- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 2.85 శాతం తగ్గి రూ.9,149 కోట్లకు పరిమితమైంది.
- బ్యాంక్ గ్లోబల్ డిపాజిట్లు 8 శాతం పెరిగి రూ.13.69 లక్షల కోట్లకు చేరుకోగా, గ్లోబల్ అడ్వాన్స్‌లు 10 శాతం అధికమై రూ.10.49 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ రూ.24.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

బీమాకు పన్ను సుస్తీ

ఆరోగ్య బీమా, ఔషధాలపై పన్నుల భారం తగ్గించాలన్న డిమాండ్లు

ఈసారి బడ్జెట్‌లోనైనా ఊరట లభించేనా?



న్యూఢిల్లీ, జనవరి 27: ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాలు ఈసారి బడ్జెట్‌పై భారీ అంచనాల్నే పెట్టుకున్నాయి. సగటు మనిషి సైతం ఖరీదెక్కిన వైద్య చికిత్సల నుంచి ఉపశమనాన్ని ఆశిస్తున్నాడు. ఈ క్రమంలోనే రాబోయే బడ్జెట్‌లో ఔషధాలపై పన్నులను తగ్గించాలని, ఆరోగ్య బీమాపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)కు సంబంధించి పడుతున్న భారాన్ని కట్టడి చేయాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. దేశంలో ఇప్పటికీ చాలామందికి ఆరోగ్య బీమా లేదన్న విషయాన్ని ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ కూడా గుర్తుచేస్తున్నది. పన్నులకు కోత పెడితే అందరికీ సులువుగా బీమా ప్రయోజనాలు అందుతాయంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. నిర్మలా సీతారామన్‌కు ఇది ఎనిమిదో బడ్జెట్ కానుండగా, వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారుకు రెండోది. అయితే గత ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఈ దఫాకు ఇదే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కానున్నది.

ప్రోత్సాహకాలివ్వాలి

ప్రజారోగ్య సదుపాయాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, ప్రైవేట్ రంగానికి ఇతర ప్రోత్సాహకాలను అందిస్తే సామాన్యులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు దక్కుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్య సంరక్షణ సేవలపై ఇన్‌పుట్ జీఎస్టీని తగ్గించాలంటున్నారు. ప్రీమియంలతో పోల్చితే వాటి క్లెయింల విలువ ఎక్కువని, కాబట్టి బీమా ఇండస్ట్రీకి ప్రోత్సాహకాలు లభిస్తే బాగుంటుందని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

ఐటీ చట్టంలోని సెక్షన్ 80డీ కింద ప్రస్తుతం వ్యక్తిగత కుటుంబ ఆరోగ్య బీమా కొనుగోలుపై 25,000 వరకు పన్ను మినహాయింపును కోరవచ్చు. ఒకవేళ ట్యాక్స్‌పేయర్ వయసు 60 ఏండ్లు దాటితే ఇది రూ.50,000గా ఉన్నది. అలాగే తల్లిదండ్రుల కోసం తీసుకునే ఆరోగ్య బీమాకూ మరో రూ.25,000 వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వారి వయసు 60 ఏండ్లు దాటితే ఈ ప్రయోజనం రూ.50,000. మొత్తంగా ఆరోగ్య బీమాలకు ఏటా చేసే చెల్లింపుల్లో గరిష్ఠంగా లక్ష రూపాయలదాకా పన్ను మినహాయింపులు తీసుకోవచ్చు. అయితే ద్రవ్యోల్బణం దృష్ట్యా ఎక్కువ ప్రయోజనాలున్న సమగ్ర పాలసీలనే ఇప్పుడు తీసుకోవాల్సి వస్తున్నది. వాటి ప్రీమియంలూ ఎక్కువే. అందుకే ఈసారి బడ్జెట్‌లో ఈ పన్ను మినహాయింపులను ఇంకా పెంచాలన్న డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కాగా, సెక్షన్ 80డీడీ కింద ట్యాక్స్‌పేయర్స్ తమపై ఆధారపడిన దివ్యాంగుల వైద్య చికిత్సకు చేసే చెల్లింపులకుగాను ఏటా రూ.1.25 లక్షలదాకా పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వ్యక్తిగత వైద్య చికిత్స ఖర్చులకూ సెక్షన్ 80డీడీబీ కింద లక్ష రూపాయల వరకు క్లెయిం చేసుకోవచ్చు.

ఎస్బీఐ నివేదిక..

ఇక టర్మ్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ, పన్నుల మినహాయింపును ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఎస్బీఐ రిసెర్చ్ చెప్తున్నది. వైద్య పరికరాలపై జీఎస్టీ రేట్లు 5, 12 శాతం మించకుండా నిర్ణయం రావచ్చని తెలుస్తున్నది. ప్రస్తుతం 18 శాతం పడుతున్నది. కాగా, 'టర్మ్/పూర్తి జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ లేదా ఎలాంటి పన్నులు ఉండరాదు' అని ఎస్బీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొన్నది. ఎన్‌పీఎస్‌కు వీలుగా పాత/కొత్త పన్ను విధానాల్లో జీవిత, ఆరోగ్య బీమా కోసం ప్రత్యేకంగా పన్ను మినహాయింపు రూ.25,000, 50,000 ఉండాలంటున్నది. ఇదే క్రమంలో ఏపీవై, పీఎం-ఎస్‌వైఎం, పీఎం-కేఎంవై, ఎన్‌పీఎస్-ట్రేడర్లు వంటి అన్ని ప్రభుత్వ స్పాన్సర్డ్ పెన్షన్ స్కీములను ఒకే గొడుగు కిందకు తీసుకురావచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి.

పాత పన్ను విధానానికి స్వస్తి?

ప్రస్తుతం ఆదాయ పన్ను చెల్లింపుదారులకు పాత, కొత్త పన్ను విధానాలు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఐదేండ్ల కిందట కొత్త పన్ను విధానాన్ని పరిచయం చేసిన కేంద్ర ప్రభుత్వం.. ఏటా దాన్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తూ రకరకాల ప్రోత్సాహకాలు, మినహాయింపుల్ని ఇస్తున్న సంగతీ విదితమే. ఈ క్రమంలో పాత పన్ను విధానాన్ని పూర్తిగా పట్టించుకోవట్లేదన్నా అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో పాత పన్ను విధానానికి స్వస్తి పలుకనున్నారన్న అంచనాలు న్నాయి. దీనివల్ల ఇకపై ఒకే పన్ను విధానం ఉండనున్నది. ఆయా సెక్షన్ల కింద వివిధ రకాల పెట్టుబడులు, పొదుపు, ఖర్చులపై ట్యాక్స్‌పేయర్స్ పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపుల్ని క్లెయిం చేసుకోవచ్చు. కానీ కొత్త పన్ను విధానంలో ఇవేవీ ఉండవు. వార్షిక ఆదాయం నిర్ణీత పరిమితి దాటిందంటే ఏ మినహాయింపులకు తావు లేకుండా అందరికీ ఆయా శ్లాబుల ప్రకారం పన్నులు వర్తిస్తాయి. మరోవైపు పాత పన్ను విధానాన్ని ఒకేసారి ఎత్తేయకుండా, రెండేండ్ల తర్వాత రద్దై పోతుందన్న నిర్ణయాన్ని ఈసారి బడ్జెట్‌లో ప్రకటించవచ్చన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ఏదిఏమైనా పాత పన్ను విధానాన్ని తొలగిస్తే మదుపు, పొదుపులకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చకపోవచ్చన్న వాదనలు వస్తుండటం గమనార్హం. ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులకు నష్టమేనంటున్నారు. ఇక ట్యాక్స్‌పేయర్స్ ఐటీఆర్‌లను దాఖలు చేసేటప్పుడు కొత్త పన్ను విధానమే డీఫాల్ట్‌గా సెలెక్టై ఉంటుంది. దీన్ని గుర్తించి పాత పన్ను విధానాన్ని ట్యాక్స్‌పేయర్సే ఎంచుకోవాలి. లేదంటే ఐటీ రిటర్నులు కొత్త పన్ను విధానంలోనే ఫైలింగ్ జరిగిపోతాయి.

జపాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలకు రెడీ

రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జనవరి 27(నమస్తే తెలంగాణ): జపాన్‌లోని అయిచీ రాష్ట్రం జపాన్‌తో వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలకు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పలుకుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అయిచీ అడ్మినిస్ట్రేవ్ డిస్ట్రిక్ట్ ఆఫ్ జపాన్‌కు చెందిన ప్రతినిధులతో మంత్రి సోమవారం సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయిచీ అసెంబ్లీ సభ్యుడు, ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన హిరోహితో కొండో ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాది తమ రాష్ట్రంలో జరిగే 20వ ఆసియా క్రీడలకు రావాలని మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించారు.

క్రెడిట్ కార్డులకు డిమాండ్

ముంబై, జనవరి 27: దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల సంఖ్య అమాంతం పెరిగింది. గడిచిన ఐదేండ్లలో కార్డుల సంఖ్య రెండింతలు పెరిగినట్లు రిజర్వుబ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. డిసెంబర్ 2019లో 5 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డులు ప్రస్తుతం 10.80 కోట్లకు చేరుకున్నాయని, ఇదే సమయంలో డెబిట్ కార్డులు మాత్రం యథాతథంగా ఉన్నాయని పేర్కొంది. అలాగే డిజిటల్ చెల్లింపులు కూడా రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. ఐదేండ్ల క్రితం 80.53 కోట్లుగా ఉన్న డెబిట్ కార్డులు ప్రస్తుతం 99.08 కోట్లకు చేరుకున్నాయి.

హట్సన్ జహీరాబాద్ ప్లాంట్ విస్తరణ

హైదరాబాద్, జనవరి 27: అరుణ్ ఐస్‌క్రీం పేరుతో ఐస్‌క్రీం ఉత్పత్తులను విక్రయిస్తున్న హ్యాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్..జహీరాబాద్ ప్లాంట్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకున్నది. గతంలో రోజుకు లక్ష కిలోల ఐస్‌క్రీంలను ఉత్పత్తి అవుతున్న ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 1.27 లక్షల కిలోలకు పెంచుకున్నట్లు కంపెనీ చైర్మన్ ఆర్‌జీ చంద్రమోగన్ తెలిపారు. దీంతో ఈ యూనిట్ దేశంలో అతిపెద్ద ఐస్‌క్రీం యూనిట్ కావడం విశేషమన్నారు. దీంతో గ్రూపు టర్నోవర్ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్‌లోని సూరారం వద్ద రోజుకు 2.8లక్షల లీటర్ల పాలను కలుపుకోని 20 ప్లాంట్లలో రోజుకు 32 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నదని చెప్పారు.

మార్కెట్లో ట్రంప్ క్రాష్

ముంబై, జనవరి 27: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా నష్టపోయాయి. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ పరస్పర సుంకాల సమరానికి కాలుదువ్వుతున్నట్టు సంకేతాలు రావడంతో మదుపరులు ఒక్కసారిగా భయాందోళనకు లోనయ్యారు. ఈ క్రమంలోనే అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోగా.. అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ రెండూ పెద్ద ఎత్తున క్షీణించాయి. సెన్సెక్స్ 824.29 పాయింట్లు లేదా 1.08 శాతం కోల్పోయి 76వేల స్థాయికి కింద 75,366.17 వద్ద ముగియగా, నిఫ్టీ 263.05 పాయింట్లు లేదా 1.14 శాతం పడిపోయి 23వేల స్థాయికి దిగువన 22,829.15 వద్ద స్థిరపడింది. దీంతో గత ఏడాది జూన్ నుంచి ఈ స్థాయిలోకి సూచీలు క్షీణించడం ఇదే తొలిసారైనట్టైంది. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 922.87, నిఫ్టీ 305.30 పాయింట్లు పతనమయ్యాయి.

9.28 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఈ ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.9,28,229.09 కోట్లు హరించుకుపోయింది. చివరకు రూ.4,10,23,624.90 కోట్ల వద్ద ఆగింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 3.51 శాతం, మిడ్‌క్యాప్ 2.68 శాతం మేర నష్టపోయాయి. ఐటీ, టెక్నాలజీ, మెటల్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, చమురు-గ్యాస్ షేర్లు 3.31 శాతం నుంచి 2.41 శాతం వరకు నష్టపోయాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది మొదలు బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపద 32 లక్షల కోట్లకుపైగా కరిగిపోయింది.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

జక్రాన్‌పల్లి, జనవరి 27 : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గంగామోహన్ సోమవారం తెలిపారు. ఆర్మూర్, సుద్దపల్లిలో జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సాఫ్ట్‌బాల్ అండర్-14 ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎంపిక పోటీల్లో బాలుర విభాగంలో కొమిరె కిశోర్, పెండ్యాల నవనీత్, బాలికల విభాగంలో చిక్కాల శ్రీవర్షిణి, గేడం వనజ, గంజి వరలక్ష్మి ప్రతిభ కనబర్చి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 29 నుంచి 31 వరకు మెదక్‌జిల్లా తుప్రాన్‌లోని ఒలింపియాడ్ స్కూల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న నీటివిడుదల

మోర్తాడ్, జనవరి 27: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటల కోసం నీటి విడుదల కొనసాగుతున్నది. కాకతీయకాలువకు 2500, లక్ష్మీకాలువకు 250, అలీసాగర్ ఎత్తిపోతలకు 412, గుత్ప ఎత్తిపోతలకు 270, సరస్వతీ కాలువకు 700, వరదకాలువకు 2,667, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80.5టీఎంసీల)కు ప్రస్తుతం 1082.40 అడుగుల (51.897 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నది. లక్ష్మీకాలువ నుంచి డీ-1 కాలువకు నాలుగు, డీ-2 కాలువకు 20, డీ-3 కాలువకు 105, డీ-4 కాలువకు 121 క్యూసెక్కుల చొప్పున నీటివిడుదల కొనసాగుతున్నది. వేంపల్లి ఎత్తిపోతలకు యూనిట్-1కు 35, యూనిట్-2కు 70 క్యూసెక్కులు, బోదెపల్లి ఎత్తిపోతలకు 8, నవాబ్ ఎత్తిపోతలకు 39 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

న్యూసెన్స్ యాక్ట్ కేసు నమోదు

బుల్లెట్ బైక్‌లను సీజ్ చేసిన ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

ఆర్మూర్‌టౌన్, జనవరి 27: పట్టణంలోని పలు కాలనీల్లో బుల్లెట్ సైలెన్సర్లను మాడిఫై చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న బుల్లెట్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఎవరైనా బైకుల సైలెన్సర్లతో శబ్ద కాలుష్యానికి పాల్పడితే టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

బైక్‌ల చోరీల దుండగుల అరెస్ట్

వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

వినాయక్‌నగర్, జనవరి 27 : జిల్లాకేంద్రంలో బైక్ చోరీలకు పాల్పడుతున్న దుండగులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజావెంకట్‌రెడ్డి తన కార్యాలయంలో నగర సీఐ శ్రీనివాస్‌రాజ్‌తో కలిసి సోమవారం సమావేశం నిర్వహించి, వివరాలను వెల్లడించారు. రూరల్ పరిధిలోని శాస్త్రీనగర్‌కు చెందిన తాడెం అనిల్‌కుమార్ (మూగవ్యక్తి)పెయింటర్‌గా పనిచేసేవాడు. మద్యానికి, జల్సాలకు అలవాటు పడి బైక్ చోరీలకు పాల్పడుతున్నాడు. సదరు వ్యక్తి ఏడునెలలుగా నగరంలోని పలు ప్రాంతాల్లో నాలుగు ద్విచక్రవాహనాలు చోరీ చేశాడు. నగర సీఐ శ్రీనివాస్‌రాజ్ పర్యవేక్షణలో త్రీటౌన్ ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో కంఠేశ్వర్ వద్ద ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. అనిల్ కుమార్ పోలీసులను చూసి పారిపోగా పట్టుకొని విచారణ చేపట్టారు. బైక్‌చోరీలు చేసినట్లు ఒప్పుకోగా.. అతడిపై కేసు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

గుర్బా బాది రోడ్డు వద్ద..

బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని నగరంలోని గుర్బాబాది రోడ్డు వద్ద సోమవారం అరెస్టు చేశారు. ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో గుర్బాబాది రోడ్డులోని కృష్ణ మందిర్ వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. పల్సర్ బైక్‌పై వచ్చిన మాక్లూర్ మండలం కిషన్‌నగర్ తండాలకు చెందిన ద్యావంగుల సంతోష్, ఒల్లెపు గోపి పోలీసులను చూపి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. డిసెంబర్ 30, 2024 కంఠేశ్వర్‌లోని ఓ షాపు ఎదుట పార్క్ చేసి ఉంచిన బైక్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఖలీల్‌వాడి, జనవరి 27 : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రాజశ్రీ హెచ్చరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలున్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేస్తామని స్పష్టం చేశారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు రిఫర్ ప్రిస్క్రిప్షన్‌ను సమ్మతించి, స్కానింగ్ చేయరాదని అన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు నిబంధనలకనుగుణంగా మాత్రమే ప్రథమ చికిత్స కేంద్రాలుగా కొనసాగించాలన్నారు. మెడికల్ షాపుల్లో అబార్షన్ కోసం వాడే ఔషధాలను క్వాలిఫైడ్ డాక్టర్ రిఫరల్ స్లిప్పు లేనిదే విక్రయించవద్దని తెలిపారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలన్నీ రికార్డులు, రిపోర్టులను సక్రమంగా మెయింటేన్ చేయాలని, లేకపోతే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయబోమని తెలిపారు. సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ దీప్తి, పిల్లల వైద్యులు హరిప్రియ, గైనకాలజిస్ట్ కీర్తిప్రియ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, డాక్టర్ సమత, డాక్టర్ రాకేశ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుప్రియ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, మహిళా ఎన్జీవో పద్మాసింగ్, ఆరోగ్య చైతన్య వేదిక నుంచి ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, మెప్మా నుంచి మాధురి, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి సౌమ్య, డెమో నాగలక్ష్మి, డీహెచ్ఈ వేణుగోపాల్, దేవేందర్ పాల్గొన్నారు.

కార్మికులకు వేతనం చెల్లించాలి

సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కార్మికుల ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

కంఠేశ్వర్, జనవరి 27 : కేంద్ర ప్రభుత్వ నూతనంగా తెచ్చిన రాగిజావ పీఎం పోషణ మినరల్స్ నిర్వాహకులకు ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 10 వేల వేతనం చెల్లించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని జీజీ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిర్వాహకులకు పారితోషికం ఇవ్వాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, కోడిగుడ్లు, వంటగ్యాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, హన్మాండ్లు, స్రవంతి, చక్రపాణి, సాయమ్మ, గంగాధర్, శ్రీను, నాగలక్ష్మి, బుచ్చయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడిలో గంజాయి పట్టివేత

వినాయక్‌నగర్, జనవరి 27 : నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ చంద్రభాను నాయక్ పర్యవేక్షణలో సోమవారం రాత్రి గంజాయి పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ వెల్లడించారు. నగర శివారులోని బోర్గాం(పీ) కమాన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన కమ్మం శ్రావణ్ అనే వ్యక్తిని సోదా చేయగా.. 530 గ్రాముల గంజాయి పట్టుబడినట్లు వెల్లడించారు. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన సదరు యువకుడు గంజాయి విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించేందుకు ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది భూమన్న, విష్ణు, అవినాష్, శ్యామ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి ఆశ్రమాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

ఆశ్రమంలో చిన్నారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

కోటగిరి, జనవరి 27 : మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్ సమీపంలో గుమ్మడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన అనాథాశ్రమాన్ని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ పద్మావతి సోమవారం సందర్శించారు. ఆమెకు ఆశ్రమంలోని విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పిల్లలతో మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది చిన్నారులు ఉన్నారని మేనేజర్ మధుకర్‌ను అడగగా.. 17 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని పిల్లలకు సూచించారు. ఫౌండేషన్ మేనేజర్ మధుకర్, లక్ష్మణ్ ఉన్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ గడువు

డిచ్‌పల్లి, జనవరి 27 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు నేటితో ముగియనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ పడిగెల దశరథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్లు తెలిపారు.

పలువురికి జైలుశిక్ష

శక్కర్‌నగర్, జనవరి 27: మద్యం తాగి వాహనాలు నడపడంతోపాటు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మద్యం తాగిన వాహనాలు నడిపిన సంగం గ్రామానికి చెందిన కాంబ్లే గంగాదీపక్, రెంజల్ బేస్‌కు చెందిన కర్రోళ్ల సాయిలుకు ఒక రోజు, తోపుడు బండితో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ఒకరికి , రాకాసీపేట్‌లో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన ఇరువురు వ్యక్తులకు ఒక రోజు చొప్పున జైలుశిక్ష విధించారు.

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి

రెంజల్, జనవరి 27: పొలం వద్ద ఆదివారం జారి పడి గాయాలైన వ్యవసాయ కూలీ సోమవారం మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన ప్రశాంత్(30) పొలం గట్టుపై నడుచుకుంటూ వెళ్తుండగా జారి పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని కుటుంబీకులు బోధన్ ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని కుటుంబీకులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

రవి

ముప్కాల్, జనవరి 27: మండల కేంద్రానికి చెందిన కొమ్మల రవి (41) ఈనెల 23వ తేదీన డబ్బుల విషయంలో భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు అతడి కోసం తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి కుమారుడు సృజన్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.